క్లుప్తంగా

శ్రీ కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



క్రిష్ణదొడ్డి కొండపై శ్రీ కోనా వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సి.బెళగల్: సి.బెళగల్ మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వెంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. పూజా కార్యక్రమాలలో స్థానిక గ్రామస్తులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు స్వామి వారికి పూజలు నిర్వహించారు.

భక్తుల సందడి



మూలపెద్దమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్దమ్మ ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేషపూజలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో కళకళలాడాయి. అలాగే శ్రీదుర్గా భోగేశ్వరాలయం, బాలాజీ దేవాలయాల్లో స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా విలియం కేరి జయంతి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రవికుమార్

కర్నూలు (టౌన్): నగరంలోని కిడ్స్ వరల్డ్ సమావేశ భవనంలో జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం విలియం కేరీ 264వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బైబిల్ మిషన్ పరిపాలన అధికారి బందెల రాజు, జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బైబిల్ అనువాదం, విద్య, సామాజిక సంస్కరణలలో విలియం కేరి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత సుబ్బారెడ్డి, కార్పొరేటర్ పద్మలతా రెడ్డి, మన్సూర్ అలీ ఖాన్, పాస్టర్లు రాజేష్, క్రిష్టఫర్, సుధీర్ కుమార్, ప్రసాదరావు, మద్దిలేటి పాల్గొన్నారు.

ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా లిఫ్టర్లు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధి కారి భూపతిరావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటున్న శ్రావణి, అనిత, లక్ష్మీ, ప్రణీత (బాలికల విభాగం) అలాగే లోకేష్, కౌశిక్, ఆరిఫ్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ నిర్వహణ కార్యదర్శి వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శి రేష్మా, ఉపాధ్యక్షులు ముసామియా పాల్గొన్నారు.

ముకుందా..ముకుందా!



పోలకల్ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో శ్రీ కృష్ణుడు

● ఘనంగా గోకులాష్టమి వేడుకలు

ఓర్వకల్లు: శ్రీకృష్ణాష్టమి వేడుకలు పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల్లో అంగరంగ వైభవంగా జరిగాయి. నియోజకవర్గ కేంద్రాలతో పాటు గ్రామాల్లోని ఆలయాల్లో నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. గోమాత పూజ, ఉట్లోత్సవం ఘనంగా జరిగాయి. చిన్ని కృష్ణులు, గోపికల చిలిపి చేష్టలు, నృత్యాలు అలరించాయి. ఓర్వకల్లు మండలంలో కాల్వబుగ్గ సురభి గోశాల వద్ద, ఉయ్యాలవాడలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వెలసిన కృష్ణుని దేవాలయంలో స్వాముల వారికి పురోహితులు పవణ్ కుమార్ శర్మ అభిషేకాలు, నైవేద్యం సమర్పించి విశిష్ట పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వాముల వారిని దర్శించుకున్నారు. జయజయకృష్ణ గోపాల కృష్ణ అంటూ గోపాలుని నామస్మరణ చేశారు. స్థానిక చెన్నకేశవ భజన మండలి భక్తబృందం వారు ఆలపించిన భజన గీతాలు భక్తులను అలరించాయి. అనంతరం గ్రామ ప్రజల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో త్రిమత ఏకైక గురువు త్రైత సిద్ధాంతాధి కర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి ఆశీస్సులతో త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కృష్ణాష్టమి మొదటి రోజున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు 16 నుంచి 22వ తేదీ వరకు కాల్వ, ఓర్వకల్లు, హుసేనాపురం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పురుషోత్తం, చిన్నపుల్లారెడ్డి కుమార్ ఆచారి తెలిపారు.



ఓర్వకల్లు...రాధా కృష్ణుడిని పూజిస్తున్న భక్తులు



గార్గేయపురంలో కృష్ణుడిని దర్శించుకుంటున్న దృశ్యం



శ్రీవీరనారాయణస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గోకులాష్టమి

పాణ్యం: మండలంలో గోకులాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాణ్యంలోని శ్రీ వీరనారాయణస్వామి ఆలయంలో ఈఓ సువర్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కృష్ణుడి అవతారంలో ఉన్న మహావిష్ణువును ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం వేద పండితుల సమక్షంలో కల్యాణ మహోత్సవం చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

● పాణ్యంలోని శ్రీకృష్ణ దేవాలయంలో ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

● కందికాయపల్లె గ్రామ పరిధిలోని క్రిష్ణమ్మకోనలో వెలసిన శ్రీకృష్ణ దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. రంగరంగుల తోరణాలతో అలంకరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు.



పాణ్యం.. క్రిష్ణమ్మకోన వద్ద శ్రీకృష్ణుడికి పూజలు చేసిన దృశ్యం

సి.బెళగల్: మండలం పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామంలో కొలువైన శ్రీకృష్ణుడి ఆలయంలో భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో విష్ణుసహస్రనామ పారాయణం చేపట్టారు. అనంతరం గోపూజ కార్యక్రమం నిర్వహించారు. అలాగే పోలకల్, కొత్తకోట, కె.సింగవరం, ముడుమాల, కొండాపురం, గుండ్రేవుల, సంగాల, మారందొడ్డి, బురాన్‌దొడ్డి, సి.బెళగల్ గ్రామాల్లో సైతం ప్రజలు కృష్ణాష్టమిని ఘనంగా జరుపుకున్నారు.



పాణ్యం.. ఉట్టి కొడుతున్న యువకులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. గ్రామంలో యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. అలాగే సాయంత్రం ఉత్సాహంగా ఉట్టి కొట్టారు. అనంతరం శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు.

కర్నూలు(రూరల్): గోకులాష్టమిని పురస్కరించుకుని మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గార్గేయపురంలోని శ్రీకృష్ణ దేవాలయం, నందనపల్లె సమీపంలోని రాధ, రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అభిషేకలు, అర్చనలు నిర్వహించారు.

కోడుమూరు రూరల్: కోడుమూరులోని యాదవ వీధిలో వెలసిన శ్రీకృష్ణ దేవాలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో యాదవ సంఘం సభ్యులు ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఉరేగింపు నిర్వహించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకొని యాదవ సంఘం సభ్యు లు ఎద్దులతో గిరకబండి లాగుడు, ముగ్గుల పోటీ లు నిర్వహించారు. గిరకబండి లాగుడు పోటీల్లో మొత్తం 10 జతల వృషభాలు పోటీ పడగా, బంటుపల్లె అశోక్ వృషభాలు మొదటి స్థానంలో గెలుపొందాయి. అలాగే బాలమద్దిలేటి, చాకలి లింగన్న, గొల్ల జైలు అనే రైతులకు చెందిన వృషభాలు 2,3,4 వ స్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరసగా రూ.10,016లు, రూ.7,016, రూ.5016, రూ.3,016 నగదు బహుమతులు అందజేశారు. అలాగే ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.2016, రూ.1516, రూ.1016, రూ.516 చొప్పున మొదటి నుంచి నాలుగు నగదు బహుమతులను దాతల సహకారంతో యాదవ సంఘం సభ్యులు అందజేశారు.



గొల్లలదొడ్డిలో కృష్ణాష్టమి సందర్భంగా గోపూజ నిర్వహిస్తున్న భక్తులు



సి. బెళగల్.. శ్రీ కృష్ణుడి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పండితులు, భక్తులు



కోడుమూరులో గిరకబండి పోటీల దృశ్యం

ఘనంగా వీహెచ్‌పీ ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న అనంత విశ్వ ప్రసాద్

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం హరిశ్చంద్ర శరీన్ నగర్‌లోని అభయాంజనేయ స్వామి ప్రఖండలోని సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో ఈ వేడుకలు జరిగాయి. వీహెచ్‌పీ ధర్మ ప్రసార్ రాష్ట్ర కన్వీనర్ అనంత విశ్వ ప్రసాద్ హాజరై మాట్లాడారు. వీహెచ్‌పీ 60 ఏళ్ల ప్రస్థానంలో 125 దేశాల్లో విస్తరించి 65 లక్షల మంది కార్యకర్తలు పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్తులో మరింత సేవలు విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర మీడియా కన్వీనర్ భానుప్రకాష్, మాతృశక్తి విభాగ్ కన్వీనర్ పావని, నాయకులు సంగు రామ్, ప్రవీన్, అశ్విని, పూజిత, వనజ, హారిక, అనిత, తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి



గౌతులచ్చన్న చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, గౌడ కుల సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అణగారిన వర్గాల కోసం చేసిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. శనివారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర పోరాటంలో కీలకంగా వ్యవహరించిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ఏటా అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీకాకుళం జిల్లా బారువలో పేద కల్లుగీత కార్మిక కుటుంబంలో జన్మించిన ఆయన స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. ఆయన పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి ప్రసూన, గౌడ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ కాసాని మహేష్‌గౌడ్ నాయకులు రవిశంకర్‌గౌడ్, రాజశేఖరగౌడ్, శ్రీనివాసగౌడ్, సంతోష్ గౌడ్, శేఖర్ గౌడ్, మల్లికార్జున గౌడ్, బీసీ సంఘం నాయకులు రాంబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

రజకులపై దాడులను అడ్డుకోవాలి



ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): రజకులపై జరుగుతున్న దాడులను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక రక్షణ చట్టం తేవాలని ఏపీ రజక వృత్తిదారులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎన్నికల్లో రజకులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రజక కుటుంబాలకు 200 యూనిట్ల కరెంట్‌ను ఉచితంగా ఇవ్వాలన్నారు. రజక ఫెడరేషన్ ద్వారా ఉచితంగా రుణాలు ఇప్పించాలన్నారు. రజక యువత కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో దోబీలను ఏర్పాటు చేయాలని కోరారు. రజకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 25వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్య క్రమంలో ఎల్లయ్య, శేషాద్రి, రాముడు, రమణ, రేణు క, అంజి, శేఖర్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆశలు వర్షార్పణం!

● కురుస్తున్న వర్షాలతో పంటలకు చేటు
● తేమ అధికమై పంటలకు తీవ్ర నష్టం
● ఎర్రబారిన పత్తి
● ఆందోళనలో రైతన్నలు



దెబ్బతిన్న పత్తి కాయలు చూపిస్తున్న రైతు



వర్షం నీరు నిలిచిపోవడంతో ఎర్రబారిన పత్తి పంట



దెబ్బతిన్న ఉల్లి పంట

కల్లూరు: రైతన్నలకు గతేడాది నుంచి కలిసి రావడం లేదు. ఏదో రూపంలో నష్టపోతూనే ఉన్నారు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంది. గత కొద్ది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పత్తి రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. పంట పొలాల్లో నీరు నిలిచిపోవడంతో పైర్లు ఎర్రబారాయి. తేమకు పత్తి కాయలు దెబ్బతిన్నాయి. మండలంలో గత ఏడాది కంటే ఈ ఏడాది పత్తి పంట సాగు విస్తీర్ణం పెరిగింది. మండల వ్యాప్తంగా సుమారుగా 6,711 హెక్టార్లలో పత్తి, 240 హెక్టార్లలో ఉల్లి పంటలు సాగు చేశారు. ముందస్తు కురిసిన వర్షాలకు రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారు. అయితే, గత కొన్ని రోజులుగా వద్దంటే వాన కురుస్తోంది. దీంతో పొల్లాలో తేమ అధికమై పంటలకు తీవ్ర నష్ట పరిచి రైతన్నను పీకల్లోతు కష్టాలోకి నెట్టాయి. పత్తి పొలాల్లోకి నీరు చేరి పైరు ఎర్రబారింది. మొక్కలకు కాచిన మొగ్గలు, కాయలు సైతం రాలిపోతున్నాయి. మిగిలిన కాయలు కుళ్లిపోతున్నాయి. ఉల్లి రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. వర్షం ఎక్కువై ఉల్లి పంటకు మజ్జిగ తెగులు తదితరవి సోకుతున్నాయి. తమ శ్రమతో పాటు వేలాది రూపాయల పెట్టుబడంతా వర్షార్పణమైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కాయలు మురుగుతున్నాయి

ముందస్తుగా కురిసిన వర్షాలకు మూడు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. ప్రస్తుతం పత్తి కాయ పగులు దశలో ఉంది. గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాల వల్ల పంట పొలంలో వర్షం నీరు నిలుస్తోంది. తేమ శాతం అధికమవడంతో పత్తి కాయలు మురుగుతున్నాయి.

– మాదవయ్య, చిన్నటేకూరు, కల్లూరు

నీరు నిలువ లేకుండా చూసుకోవాలి

రైతులు పంట పొలాల్లో నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలి. సస్య రక్షణ చర్యలు పాటించాలి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పంటలకు సూక్ష్మ పోషకాల కొరత ఏర్పడుతుంది. 13–0–45 ఒక కేజీ, మెగ్నీషియం సల్ఫేట్ 2కేజీలు ఒక ఎకరానికి కలిపి వర్షం తగ్గిన తర్వాత పిచికారీ చేయాలి. ఉల్లి పంటకు సోకిన కుళ్లు తెగుల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 600గ్రా/ఒక ఎకరాకు పిచికారీ చేయాలి.

– విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, కల్లూరు

మార్కెట్ అభివృద్ధికి అన్ని విధాలా సహకారం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డును అన్ని విధాలా అభివృద్ధి చే యడంతో పాటు రైతుల అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్య లు తీసుకుంటామని మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం కర్నూ లు వ్యవసాయ మా ర్కెట్ యార్డ్‌లో నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా మంత్రి హాజరై ప్రసంగించారు. మార్కెట్ కమిటీకి గౌరవ చైర్మన్‌గా కర్నూలు టీజీ భరత్ వ్యవహరిస్తారు. చైర్మన్‌గా గోల్కొండ అజ్మత్‌బీ, వైస్ చైర్మన్‌గా కే.శేషగిరిశెట్టితో పాటు 15 మంది పాలక వర్గం సభ్యులతో మార్కెట్ కమిటీ సెక్రటరీ జయ లక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు.

పోలీసు శాఖలో కర్తవ్య నిబద్ధత ముఖ్యం



నాలుగో పట్టణ హెడ్ కానిస్టేబుల్ హసన్‌ను సత్కరిస్తున్న సీఐ విక్రమసింహా

● ఫోర్త్ టౌన్ సీఐ విక్రమసింహా

కర్నూలు: పోలీసు శాఖలో కర్తవ్య నిబద్ధత ముఖ్యమని నాల్గవ పట్టణ సీఐ విక్రమసింహా అన్నారు. గుర్తు తెలియని మృతదేహాలకు గౌరవ ప్రదమైన అంతిమ సంస్కారాలు నిర్వహించి ఆదర్శంగా నిలిచి పంద్రాగస్టు సందర్భంగా మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ హసన్ అహ్మద్‌ను శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ, సహోద్యోగులతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హసన్ అహ్మద్ కర్తవ్యాన్ని నిబద్ధతతో పాటు మానవత్వంతో కూడిన సేవలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. మరణ పరిశీలన (ఇన్క్వెస్ట్) సమయంలో విచారణ అధికారికి సమగ్ర సహకారం అందించడం, అలాగే గుర్తు తెలియని మృతదేహాలను చట్టపరమైన విధానాల ప్రకారం గౌరవప్రదంగా నిర్వహించడం వంటి సేవలతో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ కిషోర్ రెడ్డితో పాటు సహోద్యోగులు పాల్గొని హసన్‌ను సత్కరించారు.

జగనన్న కాలనీలో పంటల సాగు

● వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 400 ఎకరాల్లో 27,797 మందికి పట్టాలు

కర్నూలు(రూరల్): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాల పంపిణీ పెద్ద ఎత్తున చేపట్టారు. అరకొరగా కాకుండా కొత్త ఊళ్లనే నిర్మించేందుకు సిద్ధమయ్యారు. కులమతాలకు అతీతంగా, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాన్ని అందించేందుకు జగనన్న కాలనీలను తీర్చిదిద్దారు. అందులో భాగంగానే కర్నూలు మండల పరిధిలోని పి.రుద్రవరంలో 400 ఎకరాల్లో జగనన్న కాలనీ ఏర్పాటైంది. భూములను కోల్పోయిన రైతులకు సుమారు రూ.68 కోట్లు పరిహారంగా అందజేశారు. కర్నూలు అర్బన్ ప్రాంతాలకు చెందిన సొంతింటి స్థలం లేని వారికి లేఅవుట్ వేసి సకల సౌకర్యాలు కల్పించారు. భూమిని చదును చేయడంతో పాటు తాత్కాలిక రోడ్లు నిర్మించి.. బోర్లు, కుళాయిలు ఏర్పాటు చేశారు. విద్యుత్ సౌకర్యాన్ని సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడ మొత్తం 27,797 మందికి పట్టాలు పంపిణీ చేశారు.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. అధికారులు కూడా ఆ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులు కొనసాగించకపోవడంతో ఇళ్లు నిర్మించుకోవాలనుకున్న లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. ఇదే సమయంలో సమీప గ్రామాల రైతులు జగనన్న కాలనీలో పంటల సాగుకు సిద్ధమయ్యారు. పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో నెంబర్ రాళ్లు.. గ్రావెల్ రోడ్డును ధ్వంసం చేశారు. యథేచ్ఛగా పంటలు సాగు చేస్తున్నారు. సుమారు 40 ఎకరాల్లో పి.రుద్రవరం, శివరామపురం గ్రామాల రైతులు గత సంవత్సర కాలంగా మొక్కజొన్న, టమాట, ఉల్లి, కూరగాయల పంటలను సాగు చేస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. ఈ కారణంగా జగనన్న కాలనీ రూపు కోల్పోతుంది. ఎంతో ఉన్నతాశయంతో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగించాల్సింది పోయి నిరుపేదల ఆశలను గాలికొదిలేయడం విమర్శలకు తావిస్తోంది.





పి.రుద్రవరంలో జగనన్న కాలనీలో సాగు చేసిన మొక్కజొన్న పంట,చిత్రంలో ప్లాటును సూచించే సర్వే రాయి , పాట్ల నెంబర్లను సూచించే రాళ్లను తొలగించి ఓ మూలకు చేర్చిన దృశ్యం

సాగు చేయవద్దని దండోరా వేయించాం



జగనన్న కాలనీలో పేదలకు కేటయించిన స్థలాలను పంట పొలాలుగా మార్చి సాగు చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే గ్రామంలో దండోరా వేయించి సాగు చేసుకోవద్దని చెప్పాం. భూములు సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవు.

– టి.వి.రమేష్ బాబు, కర్నూలు రూరల్ తహసీల్దార్

నేడు తెలుగు కథపై సదస్సు

కర్నూలు కల్చరల్: సాహిత్య అకాడమీ, సాహితీ స్రవంతి సంయుక్తంగా నిర్వహిస్తున్న 75 సంవత్సరాలు (1947–2022) తెలుగు చిన్న కథలు అన్న అంశం పై ఆదివారం ఉదయం సీక్యాంప్ టీజీవీ కళా క్షేత్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, చక్రపాణి యాదవ్ తెలిపారు. సదస్సును రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ ప్రారంభిస్తారన్నారు.